# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ సోమవారం 23-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:161 పేజీలు:6 వెల: రూ.1/-


## కాస్‌గంజ్‌లో ఘోరం.. కుటుంబంలోని ఐదుగురూ అనుమానాస్పద మృతి..!

ఉత్తరప్రదేశ్ ఫిబ్రవరి 22: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాస్‌గంజ్ జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ ఘటన స్థానికంగా పెను కలకలం రేపింది. భర్తే తన భార్యను, ముగ్గురు పిల్లలను కిరాతకంగా హతమార్చి, ఆ తర్వాత తాను కూడా ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

వివరాల్లోకి వెళ్తే.. అమన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెట్రోల్ పంపు దగ్గర సత్యదేవ్ ఫౌజీ అనే వ్యక్తి వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి అక్కడే నివసిస్తున్నాడు. అయితే గత రెండు రోజులుగా అతని ఇంటి తలుపులు మూసే ఉన్నాయి.

ఇవాళ ఉదయం ఆ ఇంటి నుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లగా.. ఒకే గదిలో ఐదు మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో కనిపించాయి. మృతదేహాల పరిస్థితిని బట్టి చూస్తే ఈ ఘోరం జరిగి కనీసం రెండు రోజులు అయ్యి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతులను సత్యదేవ్, అతని భార్య, ముగ్గురు పిల్లలుగా గుర్తించారు. ఫోరెన్సిక్ బృందం ఘటనా స్థలం నుంచి కీలక ఆధారాలు సేకరించింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అసలు ఈ దారుణానికి దారితీసిన కారణాలపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# అంతర్జాతీయ ఈవెంట్లో డర్టీ పాలిటిక్సా..

# ఏఐ సదస్సులో నిరసనపై కాంగ్రెస్‌పై మోదీ నిప్పులు



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 22: అంతర్జాతీయ ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ నేతలు షర్ట్స్ విప్పి నిరసన చేయడాన్ని ప్రధాని మోదీ తప్పుబట్టారు. కాంగ్రెస్ తన డర్టీ పాలిటిక్స్ కోసం అంతర్జాతీయ వేదికను వాడుకుందని మండిపడ్డారు. ఆదివారం మీరట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. "ఇండియాలో జరిగిన గ్లోబల్ ఈవెంట్‌ను కాంగ్రెస్ పార్టీ తన డర్టీ, నగ్న రాజకీయాలకు వేదికగా మార్చుకుంది. విదేశీ అతిథుల ముందు కాంగ్రెస్ నేతలు నగ్నంగా నడుచుకుంటూ వెళ్లారు. కానీ, దేశం మొత్తానికి మీరు (కాంగ్రెస్ పార్టీ) నగ్నంగానే ఉందని తెలుసు. అలాంటిది ప్రత్యేకంగా మీరు షర్ట్స్ తీయడం ఎందుకు.. దేశాన్ని అప్రతిష్టపాలు చేయడంలో కాంగ్రెస్ నేతలు బిజీగా ఉన్నారు.

సదస్సులో తప్పు చేసిన యూత్ కాంగ్రెస్ నేతలను తప్పుబట్టాల్సిన కాంగ్రెస్ పార్టీ వారిని పొగుడుతోంది. దీనికి సిగ్గుపడాల్సింది పోయి నేతలు వారిని ప్రశంసిస్తున్నారు. చివరకు కాంగ్రెస్ మిత్ర పక్షాలు కూడా వారిని తప్పుబడుతున్నాయి. కాంగ్రెస్ మిత్రపక్షాలైన టీఎంసీ, డీఎంకే, బీఎస్పీ, ఎన్‌సీపీ వంటి పార్టీలు ఈ నిరసనల్లో పాల్గొన లేదు. కానీ, కాంగ్రెస్ ఒక్క పార్టీ మాత్రమే దేశాన్ని నాశనం చేస్తోంది. మీరు ప్రధాని పదవిలో కూర్చోవాలంటే ముందుగా దేశ ప్రజల విశ్వాసాన్ని పొందండి. ఏఐ సదస్సు బీజేపీ నిర్వహించిన సదస్సు కాదు. అందుకే అక్కడ బీజేపీ నేతలెవరూ లేరు.

ఇది ఇండియా నిర్వహించిన సదస్సు. కాంగ్రెస్ విధానాన్ని దేశం మొత్తం ఖండిస్తోంది. గతంలో నన్ను, నా తల్లిని అవమానించారు. ఇప్పుడు ప్రపంచం ముందు దేశం పరువు తీశారు" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన ఏఐ సదస్సులోని భారత్ మండపం, హాల్ నెం.5లో యూత్ కాంగ్రెస్ నేతలు షర్ట్స్ తీసేసి, అర్ధనగ్నంగా నిరసన చేపట్టారు. ఇండియా-యూఎస్ డీల్‌కు వ్యతిరేకంగా ఈ నిరసన చేపట్టారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, అరెస్టు చేశారు. ఈ ఘటనపై దేశంలోని అన్ని వర్గాల నుంచి కాంగ్రెస్‌పై వ్యతిరేకత వ్యక్తమైంది.

# చంద్రబాబుకు మేమెందుకు సహకరిస్తాం?: సీఎం రేవంత్‌రెడ్డి



ములుగు, ఫిబ్రవరి 22: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకు తాము సహరిస్తున్నామని బీఆర్ఎస్ నేతలు చౌకబారు విమర్శలు చేయొద్దని హితవు పలికారు. అక్కడ సెటిల్ అయిన వారికి తామెందుకు సహకరిస్తామని ప్రశ్నించారు. ఇవాళ(ఆదివారం) ములుగు జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. తుపాకులగూడెం దేవాదుల ప్రాజెక్టుని సందర్శించారు. దేవాదుల పనుల పురోగతిపై అధికారులతో సీఎం రేవంత్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. పక్క రాష్ట్రాల వారితో చర్చించి తెలంగాణ నీటి హక్కులు కాపాడుకుంటామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు విలువైన సూచనలిస్తే స్వీకరిస్తామని చెప్పుకొచ్చారు. ఓటేయకపోవడం ప్రజలదే తప్పు అన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. గోదావరి నది జలాలపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చిద్దామన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేద్దామంటే నిధుల కొరత వచ్చిందని ప్రస్తావించారు. రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని తెలిపారు.

త్వరలోనే అన్ని నిధులనూ విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేవాదుల ప్రాజెక్టు 2001లో రూ.6వేల అంచనాతో మొదలై.. రూ.18,500 కోట్లకు అంచనాలు పెరిగాయని తెలిపారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం మహా అద్భుతం అన్నారని.. తాము వచ్చినప్పటి నుంచి ఒక్క చుక్క ఎత్తిపోయలేదని చెప్పుకొచ్చారు. అయినా దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తి జరిగిందని అన్నారు. ప్రాజెక్టులు, నీళ్లపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమని తెలిపారు. బీఆర్ఎస్ నేతలంతా జ్ఞానవంతులమని తాము చెప్పడం లేదని.. మీరు సూచనలు చేస్తే తీసుకుంటామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును వదిలేయకుండా ఉపయోగంలోకి తెస్తామని స్పష్టం చేశారు. ఒక్క కాళేశ్వరం పైనే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే తమపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు.

### కృష్ణా జలాలపై అసెంబ్లీలో క్లారిటీ ఇచ్చాం..

గోదావరి జలాల వివాదం రాజకీయరంగు పులుముకుందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కృష్ణా జలాల తరలింపు అంశంపై అసెంబ్లీలో క్లారిటీ ఇచ్చామని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు నీళ్లు, నిధులు బాగానే ఉన్నాయని ప్రస్తావించారు. కేసీఆర్ హయాంలో ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే.. వివాదాలే ఉండేవి కావని చెప్పుకొచ్చారు. 960 టీఎంసీలకు సరిపడా ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే సమస్యే ఉండేది కాదని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తిచేసి తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని స్పష్టం చేశారు. రూ.6 వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన దేవాదుల.. ఇవాళ రూ.18 వేల కోట్ల వ్యయానికి చేరిందన్నారు. ప్రాజెక్టుల కోసం భూసేకరణకు నిధుల కొరత ఉందన్నారు. భూ సేకరణ కోసం నిధులు వెతుక్కునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసేలా కృషి చేస్తామని అన్నారు.

### భూసేకరణ కోసం రూ.600 కోట్లు మంజూరు చేస్తాం..

జూన్ 2వ తేదీ లోపల భూసేకరణ కోసం రూ.600 కోట్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌లో పై అన్ని అంచనాలనూ ప్రభుత్వం ముందు ఉంచి ఆమోదం తీసుకోవాలని తెలిపారు. మార్చిలో మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి అన్ని అంచనాలకు ఆమోదిస్తామన్నారు. నెలలోపే దేవాదుల పంప్ రిపేర్ చేయాలని అధికారులని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, అధికారులతో దేవాదులపై కమిటీ హాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. అన్ని ప్రాజెక్టుల భూ సేకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని వివరించారు. రామప్ప చెరువు నుంచి జంపన్న వాగుకు నీరు అందించే ప్రణాళికపై నివేదిక ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పరిహారం గ్రీన్ ఛానల్‌లో నిధులు మంజూరు చేస్తామని.. భూ సేకరణ జాప్యం వల్ల ప్రాజెక్టుల పనులు ఆగడానికి వీలు లేదని పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో లగ్జరీ కారు బీభత్సం.. పలువురికి తీవ్ర గాయాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 22: హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఇవాళ (ఆదివారం) మధ్యాహ్నం ఓ ఫెరారీ స్పోర్ట్స్ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి అవతలి రోడ్డులోకి దూసుకెళ్లింది. ఎదురుగా వస్తున్న కార్లు, బైకులను ఢీకొట్టింది. జూబ్లీహిల్స్ రోడ్ నెం.45 లో నటుడు నందమూరి బాలకృష్ణ నివాసం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.

ఈ ప్రమాదం కారణంగా పలు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. రోడ్డుపై వాహనాలు అడ్డదిడ్డంగా పడిపోవడంతో రోడ్ నెం.45లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు.

ప్రమాదంవల్ల రోడ్ నెం. 45 నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు, అదేవిధంగా కేబుల్ బ్రిడ్జి నుంచి రోడ్ నెం.45 వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. వాహనదారులు ఈ మార్గాలను తప్పించి ప్రత్యామ్నాయ రూట్లలో ప్రయాణించాలని పోలీసులు సూచించారు. కాగా ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ములుగు జిల్లాలో అగ్నిప్రమాదం..

ములుగు జిల్లాలోని గోవిందరావుపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయం స్టోర్ రూమ్‌లో ఇవాళ(ఆదివారం) అగ్ని ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనతో స్థానికులు అప్రమత్తమయ్యారు. కార్యాలయంలో భద్రపరిచిన పలు ముఖ్య రికార్డులు మంటల్లో కాలిపో యినట్లు సమాచారం. అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్యాలయంలోని స్టోర్ రూమ్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటాన్ని గమనించి స్థానికులు అప్రమత్తమయ్యారు.

మంటలు వేగంగా వ్యాపించడంతో కార్యాలయమంతా పొగలు కమ్ముకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉన్న వనరులతో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.

ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కార్యాలయంలోని పాత వైరింగ్ లేదా విద్యుత్ లోపాల వల్లే మంటలు చెలరేగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. కాలిపోయిన రికార్డుల వివరాలను సేకరిస్తున్నారు.

# నిర్మల్‌లో శివాజీ విగ్రహావిష్కరణ వివాదం.. ఎమ్మెల్యేల అరెస్టులతో ఉద్రిక్తత

నిర్మల్, ఫిబ్రవరి 22: నిర్మల్ జిల్లా కుంటాల మండలం ఓలా గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమం రాజకీయంగా పెను దుమారం రేపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాల్సిన హైదరాబాద్ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

విగ్రహావిష్కరణ కోసం వస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోలీసులు తుప్రాన్ వద్ద అడ్డుకున్నారు. అటు, భైంసాలో బీజేపీ ఎమ్మెల్యే రామారావు పాటిల్‌ను పోలీసులు గృహ నిర్బంధం (హౌజ్ అరెస్ట్) చేశారు. కామారెడ్డికి బయలుదేరుతున్న ఆయనను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ వచ్చే వరకు విగ్రహాన్ని ఆవిష్కరించే ప్రసక్తే లేదని రామారావు పాటిల్ స్పష్టం చేశారు.

పోలీసుల మోహరింపు:

విగ్రహావిష్కరణపై వివాదం నెలకొనడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు. ఈ పరిణామాలతో ఓలా గ్రామం, భైంసా ప్రాంతాల్లో హైటెన్షన్ కొనసాగుతోంది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ఆంక్షలు కఠినతరం చేశారు.

# అఫ్ఘానిస్థాన్ నివాస ప్రాంతాలపై పాకిస్థాన్ దాడులు.. పలువురు పౌరులు మృతి



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 22: ఉగ్రవాదులే లక్ష్యమని చెప్పి అఫ్ఘానిస్థాన్ పై పాకిస్థాన్ దాడులకు పాల్పడింది. పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లోని నివాస ప్రాంతాలపై దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పలువురు అఫ్ఘాన్ పౌరులు మృతిచెందారు. ఇటీవల తమ దేశంలో జరిగిన ఆత్మాహుతి దాడులకు ప్రతీకారంగా ఈ దాడులు నిర్వహించినట్లు పాకిస్థాన్ పేర్కొన్నది. నంగర్హార్, పాక్టికా ప్రావిన్స్‌లలో శనివారం అర్ధరాత్రి దాటాక ఈ దాడులు జరిగాయి.

తమ పౌరుల నివాసాలపై పాకిస్థాన్ బాంబులతో దాడి చేసిందని, ఈ ఘటనలో డజన్ల కొద్దీ చనిపోయారని అఫ్ఘాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ చెప్పారు. గాయపడిన వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నారని తెలిపారు. ఈ దాడి ఘటనను పాకిస్తాన్ ధ్రువీకరించింది. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఏడు టెర్రరిస్ట్ క్యాంపులపై దాడులు చేపట్టినట్లు ఆ దేశ సమాచారశాఖ మంత్రి తరూర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

పాకిస్థానీ తాలిబాన్, దాని అనుబంధ సంస్థలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఐసిస్ అనుబంధ గ్రూప్‌పై సైతం దాడి చేసినట్లు తరూర్ పేర్కొన్నారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో మసీద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిని తామే చేసినట్లు ఐసిస్ ప్రకటించుకుంది. ఈ ఘటనలో 31 మంది పాక్ పౌరులు మృతి చెందగా, 161 మంది గాయపడ్డారు.

# మావోయిస్టు పార్టీకి ఎదురుదెబ్బ.. లొంగిపోయిన దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 22: మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. కీలక నేతలు దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి లొంగిపోయారు. వీరితో సహా 16 మంది మావోయిస్టులు తెలంగాణ ఎస్ఐబీ ఎదుట సరెండర్ అయినట్లు సమాచారం. దీనిపై ఒకటి రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ప్రత్యేకతలు

నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత సెక్రటరీగా దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు. కేంద్ర మావోయిస్టు పార్టీ సెక్రటరీగా కొనసాగుతున్నారు. ఇక మల్లా రాజిరెడ్డి కేంద్ర మావోయిస్టు పార్టీ సెక్రటరీగా పనిచేస్తున్నారు.




# స్వచ్ఛంద సేవల వేదిక రోటరీ ఇంటర్నేషనల్

## (23 ఫిబ్రవరి "ప్రపంచ శాంతి, అవగాహన దినోత్సవం" సందర్భంగా)

23 ఫిబ్రవరి 1905న పాల్ పి. హారిస్ చొరవతో మరో ముగ్గురిని మిత్రులతో తొలి సమావేశంలో ఏర్పాటు చేసిన ఫలితంగా ప్రపంచ ప్రఖ్యాత సేవా సంస్థ రోటరీ ఇంటర్నేషనల్ ఏర్పడడంతో పాటు ఆ స్వచ్ఛంద సంస్థ ప్రపంచ శాంతి స్థాపన, యుద్ధాలు/సంక్షోభాల నిర్మూలన లేదా పరిష్కారాలకు చేస్తున్న మహత్తర ప్రయత్నాలను గుర్తించిన ప్రపంచ సమాజం ప్రతి ఏట 23 ఫిబ్రవరిన "ప్రపంచ శాంతి, అవగాహన దినోత్సవం" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. సేవా దృక్పథం కలిగిన వ్యక్తులు తమ సమయం, సంపద, మేధస్సును వినియోగించి సమాజ సేవలు చేయడానికి చికాగోలో "రోటరీ ఇంటర్నేషనల్" ఏర్పడడం, ఇతర అమెరికన్ నగరాలకు విస్తరించడం, ప్రపంచ దేశాల్లో కూడా రోటరీ క్లబ్బులు ఏర్పడడం జరిగింది. 23 ఫిబ్రవరి 1905న ఒక చిన్న క్లబ్‌తో ప్రారంభమైన రోటరీ సంస్థ నేడు 46,000 క్లబ్బులతో 1.9 మిలియన్ల స్వచ్ఛంద సేవకులతో విశ్వవ్యాప్తంగా అనేక సమాజ అవసర సేవాకార్యక్రమాలను చేయడం కొనసాగుతున్నది. 01 జనవరి 1920 రోజున భారత్‌లో కలకత్తా రోటరీ క్లబ్ ఏర్పడడంతో మొదలు నేటికి దేశవ్యాప్తంగా 3,000లకు పైగా రోటరీ క్లబ్బులతో 1,15,000 మంది సభ్యులు లేదా పొటేరియన్లు తమ సేవలను స్వచ్ఛందంగా కొనసాగిస్తున్నారు.

అంతర్జాతీయ సంక్షోభాల నివారణకు రోటరీ ప్రయత్నాలు:

ప్రపంచ శాంతి, అవగాహన దినోత్సవం వేదికగా యుద్ధాలు లేదా సంక్షోభాల పరిష్కారానికి చొరవ తీసుకుంటూ సామరస్యత, శాంతి, అవగాహనలను కల్పించడం జరుగుతుంది. ఐక్యరాజ్యసమితితో కలిసి మానవీయ చేయూత, వ్యాధుల కట్టడి, చికిత్స, విద్య/అక్షరాస్యత, ఆర్థిక సామాజికాభివృద్ధి, శాంతి స్థాపన లాంటి సేవలు అందిస్తున్నారు. 2026 ప్రపంచ శాంతి, అవగాహన దినోత్సవం ఇతివృత్తంగా "అందరికీ శాంతి : ఆయుధాలు లేని ప్రపంచ శాంతి దిశగా పయనం" అనే అంశాన్ని తీసుకున్నారు. ఇలాంటి గంభీరమైన విషయాలను దృష్టిలో ఉంచుకొని సంక్షోభాల పరిష్కారంతో శాంతి స్థాపనకి ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యూనివర్సిటీల్లో కోర్సులను కూడా రోటరీ సంస్థ ప్రారంభించడం హర్షణీయం. దీనితో పాటు శాంతి మరియు సమస్యల పరిష్కారంలో కృషి చేసిన 75 మందికి గ్రాడ్యుయేట్ స్టడీస్‌లో అడ్మిషన్లు ఇవ్వడం కూడా జరిగుతున్నది.

"సర్వీస్ ఎబో సెల్ఫ్ (స్వంత పనుల కన్న సేవలే మిన్న)" అనే నినాదంతో సేవలు అందిస్తున్న రోటరీ సంస్థ "స్వచ్ఛంద సేవకులకే తమ తమ వృత్తిలో రాణింపు కలుగుతుంది" అని నమ్ముతున్నది. ఇలాంటి రోటరీ ఇంటర్నేషనల్‌తో పాటు లయన్స్ ఇంటర్నేషనల్ కూడా విశ్వవ్యాప్తంగా స్వచ్ఛంద సేవలను అవసరార్థులకు అందిస్తూ పేద ప్రజల పక్షపాతులుగా నిలుస్తున్నారు. అలాంటి నిస్వార్థమైన సేవకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుదాం, అవసరమైన సమయాల్లో మనం కూడా మన చేయూతను అందజేద్దాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# డిజైన్, ఆవిష్కరణ, బాధ్యతలు మూలస్తంభాలని స్పష్టం చేసిన ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ సదస్సు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:హైదరాబాద్‌లోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) తన ప్రాంగణంలోని ఆడిటోరియంలో వైభవంగా నిర్వహించిన 5వ స్నాతకోత్సవ వేడుక విద్య గొప్పతనాన్ని ఘనంగా చాటింది. ఈ వేడుక 2025 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ విద్యా ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలిచింది. ఈ బ్యాచ్ విద్యార్థుల విజయాలను గుర్తించిన ఈ వేడుక... డిజైన్, ఫ్యాషన్, ఫుట్‌వేర్, రిటైల్, అనుబంధ రంగాల్లో వృత్తిపరమైన కెరీర్ల కోసం వారిని సిద్ధం చేసింది.

ఈ వేడుకకు భారత ప్రభుత్వ బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన స్నాతకోత్సవ ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ... తయారీ, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ప్రపంచంలో పెరుగుతున్న భారత్ ఆధిపత్యాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదక శక్తిగా ఉన్న పాదరక్షలు, తోలు రంగం లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తోందని... ఎగుమతులు, ఎమ్ఎస్ఎమ్ఈల వృద్ధికీ గణనీయంగా దోహదపడుతోందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ప్రపంచస్థాయి సామర్థ్యాలను బలోపేతం చేయడం కోసం సాంకేతికత, సుస్థిరత, డిజైన్ ఆవిష్కరణలను ఉపయోగించుకోవాలని ఆయన గ్రాడ్యుయేట్లను ప్రోత్సహించారు.

ఎఫ్‌డీడీఐ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వివేక్ శర్మ (ఐఆర్ఎస్) ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన కోర్సు పూర్తి చేసుకున్న గ్రాడ్యుయేట్లను అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా సమర్థులైన నిపుణులను అభివృద్ధి చేయడం పట్ల సంస్థ నిబద్ధతను శ్రీ వివేక్ శర్మ స్పష్టం చేశారు. అర్థవంతమైన సామాజిక ప్రభావాన్ని సృష్టించడానికి ఆవిష్కరణలు, సుస్థిరత, నైతిక పద్ధతులు, వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించే ఆలోచనలను స్వీకరించాలని ఆయన విద్యార్థులను కోరారు.

సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్ రెడ్డి (ఐఏఎస్) స్వాగత ప్రసంగంతో ఈ వేడుక ప్రారంభమైంది. 2018లో హైదరాబాద్ క్యాంపస్ ఏర్పాటు నుంచి ఈ సంస్థ సాధించిన వేగవంతమైన వృద్ధిని ఆయన వివరించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఆధునిక ప్రయోగ శాలలు, మెరుగైన పరిశ్రమ సహకారాలు వంటి కీలక విజయాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. 2025 బ్యాచ్‌లో ఫ్యాషన్ డిజైన్, ఫుట్‌వేర్ డిజైన్, లెదర్ గూడ్స్-యాక్సెసరీస్ డిజైన్, మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు చెందిన 72 మంది గ్రాడ్యుయేషన్ విద్యార్థులు ఉన్నారు. ఈ వేడుకలో భాగంగా విద్యార్థుల విద్యా నైపుణ్యాన్ని గుర్తిస్తూ, ఆయా ప్రోగ్రామ్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్నాతకోత్సవ ప్రతిజ్ఞనూ నిర్వహించారు. ప్రముఖులు, అధ్యాపకులు, పరిశ్రమ భాగస్వాములు, గర్వంతో ఉప్పొంగుతున్న తల్లిదండ్రుల సమక్షంలో గ్రాడ్యుయేట్లకు అధికారికంగా డిగ్రీలను ప్రదానం చేశారు.

నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, పరిశోధన, పరిశ్రమ ఏకీకరణ ద్వారా భారత పాదరక్షలు, తోలు, ఫ్యాషన్, రిటైల్ వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఎఫ్‌డీడీఐ కీలక పాత్ర పోషిస్తూనే ఉందని వక్తలు పేర్కొన్నారు. డిజైన్, తయారీలో సుస్థిర పద్ధతులను, ఔత్సాహిక పరిశ్రమలను, ప్రపంచస్థాయి ప్రమాణాలను ప్రోత్సహించడానికి ఈ సంస్థ కట్టుబడి ఉంది.

# ఇబ్రహీంపట్నంలో విషాదం

అమరావతి, ఫిబ్రవరి 22: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం – ఛత్తీస్ గఢ్ జాతీయ రహదారిపై కొండపల్లి డీవీవీ స్కూల్ ఎదుట ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విశ్రాంత ఉద్యోగి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం కొండపల్లి వడ్డే నగర్ కు చెందిన వీధి ఏసుబాబు (62) ఎన్టీటీపీఎస్ లో పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఇతను ఇబ్రహీంపట్నం వైపు నుంచి ద్విచక్ర వాహనంపై కొండపల్లి వస్తూ డీవీవీ స్కూల్ ఎదుట రోడ్డుపై బారికేడ్ ను బలంగా ఢీకొట్టడంతో అతనిపై పడిపోయింది. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్క నిమిషంలో ఇంటికి చేరాల్సిన ఏసుబాబును బారికేడ్ రూపంలో మృత్యువు కబళించడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ నెల 6న డీవీవీ స్కూల్ ఎదురుగా ఉన్న జడ్పీ బాలికల హైస్కూల్ వైపు ఓ బాలుడు మృతి చెందాడు. అదే రోజు మాజీ సీఎం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఇబ్రహీంపట్నం విచ్చేశారు. జగన్ ను చూసేందుకు వెళ్లాలన్న ఆత్రుతతో బైక్ పై కొండపల్లి బీ కాలనీ నుంచి ఇబ్రహీంపట్నం వెళ్తున్న శ్రామికనగర్ (కొత్తగేటు)కు చెందిన భార్గవ్ (17) ఇదే విధంగా రోడ్డుపై బారికేడ్ ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

వేగ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ఇబ్రహీంపట్నం పోలీసులు రెండు జాతీయ రహదారులపై కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్ల వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులు జాతీయ రహదారిపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ బారికేడ్ల వద్ద వేగ నియంత్రణ చేయలేక వాటిని ఢీకొంటున్నారు. నాలుగు చక్రాల వాహనాలు బారికేడ్లను ఢీకొని వెళ్లిపోతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులకు ఈ బారికేడ్లు ప్రాణసంకటంగా మారాయి. వీటిని ఢీకొంటున్న చోదకులకు బలమైన గాయాలై మృతి చెందుతున్నారు. డీవీవీ స్కూల్ వద్ద ఈ నెలలో జరిగిన రెండు ప్రమాదాల్లోనూ బారికేడ్ల వల్ల బలమైన గాయాలై ఇద్దరు మృతి చెందారు.

ఈ ఏడాది జనవరి 2వ తేదీన గుంటుపల్లి డాన్ బోస్కో స్కూల్ ఎదుట వేగంగా వెళ్తున్న లారీ బారికేడ్లను దాటే క్రమంలో వేగాన్ని అదుపుతప్పి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం మధిర పట్టణానికి చెందిన వెల్లంకి బాబూరావు (55) లారీ కింద ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందారు.

ఇతని భార్య మరియం (55) తీవ్ర గాయాలతో బయటపడింది. ప్రమాదాలను నివారించాలని పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేస్తే వాహన చోదకుల నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు పోతున్నాయి. ఈ బారికేడ్ల ఏర్పాటుపై పోలీసు ఉన్నతాధికారులు పునరాలోచించి చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

# అందరి కోసం ఏఐ: భారత మండపంలో బహుభాషా ఓపెన్ సోర్స్ ఏఐ నమూనా ప్రదర్శన



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:అందరికీ అందుబాటులో ఉండేలా, స్థానిక అవసరాలకు అనుగుణంగా ఏఐ వ్యవస్థలను రూపొందించటానికి భారత్ ఇస్తున్న ప్రాధాన్యతను చాటిచెబుతూ ఫిబ్రవరి 20న భారత మండపంలో ""అందరి కోసం ఏఐ: వ్యక్తిగత, స్థానిక, బహుభాషా ఏఐ ఆవశ్యకత'' అనే అంశంపై సదస్సును నిర్వహించారు.

డిజిటల్ ఇండియా భాషిణి విభాగం, కరెంట్ ఏఐ, కల్ప ఇంపాక్ట్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన, ప్రపంచంలోనే మొదటి ఓపెన్ సోర్స్ హ్యాండ్‌హెల్డ్ బహుభాషా ఏఐ ప్రోటోటైప్‌ను ఈ సెషన్‌లో ప్రదర్శించారు. తక్కువ లేదా అసలు ఇంటర్నెట్ అనుసంధానం లేని ప్రాంతాల్లోనూ పనిచేసేలా, వ్యక్తిగత భద్రతను కల్పిస్తూ, స్థానికంగా వినియోగించుకునేలా ఈ కాంపాక్ట్ వాయిస్-ఫస్ట్ డివైజ్‌ను రూపొందించారు. నిరంతరం ఇంటర్నెట్ సదుపాయం లేకపోయినా పరికరంలోనే బహుభాషా సంభాషణలను విశ్లేషించటం ద్వారా వివిధ భాషల్లో అప్పటికప్పుడే సమాచారాన్ని పొందే వీలుంటుంది.

సమ్మిళిత, సాంస్కృతిక మూలాలకు అనుగుణంగా భాషా వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా ఏఐ వ్యవస్థలను రూపొందించేందుకు భారత్ ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ నమూనా ఒక నిదర్శనం. ప్రజా ప్రయోజనాలకు సహాయక సాంకేతికతగా రూపొందించిన ఈ పరికరం.. ఓపెన్ సోర్స్ ఏఐ హార్డ్‌వేర్ సురక్షితంగా, సులభంగా అందుబాటులో ఉండేలా ఎంతగా విస్తరించదగినదో నిరూపిస్తుంది. గ్రామీణ, వసతులు లేని ప్రాంతాలకు ఇది కీలకం. వివిధ భాషల్లో వినియోగాన్ని, భారతీయ భాషా వ్యవస్థ అంతటా దీన్ని ఎలా అన్వయించవచ్చో ఆచరణాత్మకంగా ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు.

కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్‌కి ఈ నమూనాను భాషిణి బృందం వివరించింది. అందరికీ ఏఐ అనే లక్ష్యానికి అనుగుణంగా సమ్మిళిత, బహుభాషా సామర్థ్యంతో స్థానికంగా వినియోగించుకోదగిన ఏఐ పరిష్కారాల అభివృద్ధికి చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు.

వ్యూహాత్మక ప్రపంచ స్థాయి భాగస్వామ్య నమూనాకు ఈ భాగస్వామ్యం ప్రతిరూపం. భారత డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల విధానాన్ని, భాషా సంబంధిత ఏఐ సాంకేతికతను, అంతర్జాతీయ ఓపెన్ హార్డ్‌వేర్ ఆవిష్కరణలతో ఇది అనుసంధానిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంజినీరింగ్ విద్యార్థులు, వృత్తి నిపుణులను ప్రోత్సహించేందుకు గ్లోబల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌ను ప్రకటించారు. ఇది ఓపెన్ సోర్స్ ప్రోటోటైప్ ఆధారంగా నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ, భారత ఆవిష్కరణల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది.

ఏఐ రంగంలో ఏకరూపకతను నివారించటమే కాక, నూతన ఏఐ వ్యవస్థలు ప్రపంచ వ్యాప్తంగా ఇతర వ్యవస్థలతో కలిసి పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందిస్తూనే, భాషా, సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడాల్సిన ఆవశ్యకతను ఈ సమావేశం స్పష్టం చేసింది.

సమ్మిళిత, బహుభాషా, వ్యక్తిగత గోప్యతను కాపాడే ఏఐ అభివృద్ధిలో భారత నాయకత్వ స్థానాన్ని ఈ కార్యక్రమం మరింత బలోపేతం చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సమానత్వం, బాధ్యతయుతమైన ఏఐ ఆవిష్కరణలకు ఆదర్శవంతమైన నమూనాను ఇది అందిస్తుంది.

# ప్రకృతి సాగుతోనే ఆరోగ్య సిరులు..

-రైతులకు సుస్థిర ఆదాయం,
-సమాజానికి మెండైన ఆరోగ్యం.
-ప్రపంచ మనుగడకు ఏకైక మార్గం సేంద్రియ సేద్యం
-విజయవంతంగా ఎన్టీఆర్ జిల్లా ఆర్గానిక్ రైతు ఉత్సవం-2026..
-పండగలా సాగిన రెండో రోజు సేంద్రియ మేళా.

అమరావతి, ఫిబ్రవరి 22: నేల ఆరోగ్యం.. రైతు శ్రేయస్సు.. సమాజ శ్రేయస్సుకు, భావితరాల బంగారు భవిష్యత్తుకు కీలక మార్గమైన ప్రకృతి సేద్యం, ఆర్గానిక్ ఉత్పత్తులపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించి సేంద్రియ సాగును ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లేందుకు ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం, రైతు సాధికార సంస్థ, సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ, శ్రేయాస్ ఫార్మర్స్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో ఆదివారం జరిగిన రెండో రోజు ఎన్‌టీఆర్ ఆర్గానిక్ రైతోత్సవ్ విజయవంతమైంది. కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, ఔత్సాహిక రైతులు.. ఇలా ప్రతిఒక్కరూ ప్రకృతిసాగును ముందుకు తీసుకెళ్లడంలో తమవంతు భాగస్వామ్యం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

దేశీయ గో ఉత్పత్తుల కేంద్రం, రైతు సాధికార సంస్థ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, బయో ఇన్‌పుట్స్, పీఆర్ఐటీహెచ్‌యూ (రీజెన్ అగ్రి కార్బన్ ప్రాజెక్టు), వన్ ఎర్త్ ? వన్ లైఫ్ టెర్రాస్ గార్డెన్, సాయిశ్రీనివాస్ గోశాల, స్వయం సహాయక సంఘాల ఆర్గానిక్ ఉత్పత్తులు, దేశవాళీ వంగడాలు, ఆరోగ్య వనం తదితర స్టాళ్లు ఏర్పాటు చేసి ఆర్గానిక్ సాగుతో పాటు ఉత్పత్తుల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రబాల్ తోమర్ (కిసాన్ లెడ్జర్), ఆశా కిరణ్ (అమరావతి ఆర్గానిక్), రఘురాం (భూమి ఆర్గానిక్) తదితర ప్రకృతి సేద్యం, ఉత్పత్తుల రంగ నిపుణులు మార్కెట్ లింకేజీలపై అవగాహన కల్పించారు. రైతులు తాము పండించిన ప్రకృతి సేద్య ఉత్పత్తులకు మంచి ధర లభించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వినియోగదారుడు కూడా తనకు నాణ్యమైన ప్రకృతి సేద్య ఉత్పత్తులే కొనుగోలు చేశాననే విశ్వాసం పెంపొందించేలా తీసుకొచ్చిన ట్రేసబులిటీపై కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. క్యూఆర్ కోడ్‌తో విత్తు నుంచి విక్రయం వరకు ప్రతి సమాచారాన్ని తెలుసుకునే విధానంపై మాట్లాడారు. ఆర్గానిక్ రైతోత్సవం - నేచురల్ ఫార్మింగ్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా ఆర్గానిక్ రైతోత్సవం ఓ వినూత్న విజ్ఞానదాయక కార్యక్రమమని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా జిల్లాలో ప్రకృతి సేద్యంపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ప్రతి మండలంలోనూ కేశినేని ఫౌండేషన్ ద్వారా సేంద్రియ వ్యవసాయంపై సదస్సులు నిర్వహిస్తామని ప్రకటించారు. ఒక్కో మండలంలో మూడు రోజుల పాటు జరిగే సదస్సులో నిపుణుల భాగస్వామ్యంతో ప్రకృతి సేద్యంలో అత్యుత్తమ విధానాల (బెస్ట్ ప్రాక్టీసెస్)పై అవగాహన కల్పిస్తామన్నారు. 225 రోజుల పాటు ఈ సదస్సుల నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. సేంద్రియ ఉత్పత్తులపై మన స్వయం సహాయక సంఘాల మహిళలకు హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీలో శిక్షణ ఇప్పించామన్నారు. జిల్లాలో 100 శాతం ప్రకృతి వ్యవసాయం జరిగేలా చేసి.. దేశానికే ఆదర్శవంతంగా నిలిచేలా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ సారథ్యంలో జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో మిద్దె పంటలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ మాట్లాడుతూ అన్నదాతలకు, వినియోగదారులకు మధ్య వంతెనగా ప్రభుత్వం సేవలందిస్తోందని.. ప్రకృతి సేద్యంపై అపోహలు తొలగించి రైతులకు మంచి ఆదాయాలు వచ్చేలా, వినియోగదారులకు నాణ్యమైన ప్రకృతి ఉత్పత్తులు లభించేలా సర్టిఫికేషన్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పండించే పంట మీద నమ్మకం కల్పించేందుకు.. అంతర్జాతీయ మార్కెట్లో సైతం విక్రయాలు



జరిపేలా ఈ సర్టిఫికేషన్ ఉపయోగపడుతుందన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ దార్శనిక సీఎం 2014లో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ (జెడ్‌బీఎన్ఎఫ్)ను మన ముందుకు తెచ్చారని, ఆయన దార్శనికతకు అనుగుణంగా సేంద్రియ సాగును సమష్టి కృషితో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రంలో 107 వ్యర్థాల శుద్ధి కేంద్రాలను పెడుతున్నామని.. వీటిద్వారా రోజుకు 1,500 మెట్రిక్ టన్నుల సేంద్రియ ఎరువులను అందుబాటులోకి తెచ్చి.. మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు అతి తక్కువ ధరకే అందిస్తామని వెల్లడించారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు ప్రకృతి సేద్యం కూడా కీలక అంశమని పేర్కొన్నారు. ఆరోగ్య ఆంధ్ర సాకారానికి ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు అవసరమని? ఇందుకు ప్రకృతి సేద్యం ముఖ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలోనూ ప్రకృతి వ్యవసాయానికి కేటాయింపులు చేయడం జరిగిందన్నారు. అరకు, పాడేరు, పార్వతీపురం వంటి ప్రాంతాల్లోనూ ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యమిస్తున్నారని.. ఇదే తరహాల్లో రాష్ట్రం అంతటా ఈ సాగును అవలంబించేలా ప్రోత్సహిస్తున్నట్లు లంకా దినకర్ వివరించారు. గౌరవ పీఎం, గౌరవ సీఎం ఆదర్శాలను సమష్టిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఆర్గానిక్ మేళాలో శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు, జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ.. ప్రకృతి వ్యవసాయంతో సమాజానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. సాంకేతికత సహాయంతో ఈ ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా ప్రకృతిసేద్యాన్ని అనుసరిస్తూ పది మందికీ ఆదర్శవంతంగా నిలుస్తున్న రైతులు, అతిథులను సత్కరించారు.

కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ జి.రఘురామరాజు,జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీపీఎం వై.శంకర్ నాయక్, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయ కుమారి, ఏపీ ఛాంబర్స్ ప్రెసిడెంట్ పి.భాస్కర్ రావు, ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్‌వీ స్వామి, రమణ (విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్), రచయిత కలిమిశ్రీ తదితరులతో పాటు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్, హోటల్స్ అసోసియేషన్స్ తదితరాల ప్రతినిధులు పాల్గొన్నారు

# ఔషధ, వైద్య ఉత్పత్తుల నియంత్రణలో సహకారాన్ని బలోపేతం చేసేందుకు భారత్ - బ్రెజిల్ మధ్య అవగాహనా ఒప్పందం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:భారత్, బ్రెజిల్ దేశాలు ఔషధ, వైద్య ఉత్పత్తుల నియంత్రణ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఈ రోజు ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. భారత్ కు చెందిన సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్సీఓ) బ్రెజిలియన్ హెల్త్ రెగ్యులేటరీ ఏజెన్సీ (ఏఎన్వీఐఎస్ఏ) మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం ఇరు దేశాల మధ్య నియంత్రణ పరమైన సహకారాన్ని మరింత లోతుగా పటిష్టం చేసే దిశగా ఒక అత్యంత కీలకమైన అడుగు.

ఢిల్లీ లోని హైదరాబాద్ హౌస్‌లో భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా ద సిల్వా ల సమక్షంలో ఈ చారిత్రాత్మక అవగాహన ఒప్పందం పత్రాలను ఏఎన్వీఐఎస్ఏ డైరెక్టర్-ప్రెసిడెంట్ మిస్టర్ లియాండ్రో సఫాటిల్, బ్రెజిల్‌లో భారత రాయబారి శ్రీ దినేష్ భాటియా పరస్పరం అందజేసుకున్నారు.

ఈ అవగాహన ఒప్పందం ఔషధ తయారీ పదార్థాలు , మందులు, జీవ సంబంధిత ఉత్పత్తులు, వైద్య పరికరాలతో సహా వైద్య ఉత్పత్తుల రంగంలో సమాచార మార్పిడి, సహకారం కోసం ఒక వ్యవస్థీకృత ప్రణాళికను ఏర్పాటు చేస్తుంది. నియంత్రణ పద్ధతులలో ఏకరూపతను పెంపొందించడం, నియంత్రణ వ్యవస్థలపై పరస్పర అవగాహనను పెంచుకోవడం, వైద్య ఉత్పత్తులపై సమర్థవంతమైన, సమన్వయంతో కూడిన పర్యవేక్షణను సులభతరం చేయడం దీని లక్ష్యం.

తమ ప్రజలకు సురక్షితమైన, సమర్థవంతమైన, నాణ్యతతో కూడిన మందులు, వైద్య ఉత్పత్తులను అందుబాటులో ఉంచడంలో భారత్, బ్రెజిల్ దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ అవగాహన ఒప్పందం ప్రతిబింబిస్తుంది. ఈ ఒప్పందం సరఫరా శ్రేణులను బలోపేతం చేయడానికి, నియంత్రణ పరమైన ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించడానికి, తక్కువ ధరల్లో వైద్య పరిష్కారాలు లభించేలా మద్దతునిస్తుందని భావిస్తున్నారు.

ఈ అవగాహన ఒప్పందం, ఆరోగ్య రంగంలో భారత్, బ్రెజిల్ మధ్య ఉన్న విస్తృత సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుంది. అంతేకాకుండా, ద్వైపాక్షిక సంబంధాల కోసం ఇప్పటికే ఉన్న సంస్థాగత యంత్రాంగాలకు ఇది అదనపు బలాన్ని చేకూరుస్తుంది. ఆరోగ్యం, ఫార్మాస్యూటికల్స్, వైద్య సాంకేతిక రంగాలలో ఇరు దేశాల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యాన్ని ఇది స్పష్టం చేస్తుంది. ముఖ్యంగా, అభివృద్ధి చెందుతున్న (గ్లోబల్ సౌత్) దేశాలలో లప్రధాన భాగస్వాములుగా, ఇరు దేశాల ఉమ్మడి ప్రాధాన్యతలకు ఇది అద్దం పడుతోంది..

ఈ అవగాహన ఒప్పందం ద్వారా రెండు దేశాలు తమ జాతీయ చట్టాలు, నిబంధనలకు లోబడి సమాచార మార్పిడి, నియంత్రణ సామర్థ్య పెంపుదల, ఔషధ, వైద్య ఉత్పత్తుల నియంత్రణకు సంబంధించిన విషయాలలో సన్నిహితంగా పనిచేయాలనే తమ ఉద్దేశాన్ని పునరుద్ఘాటించాయి.

# భారతదేశంలో సమ్మిళిత స్వర సాంకేతికతల పురోగతి..

## విధాన నివేదిక, డెవలపర్స్ టూల్‌కిట్ ఆవిష్కరణ

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 22: భారతదేశంలో డిజిటల్ సమ్మిళితత్వానికి స్వర సాంకేతికతలు (వాయి స్ టెక్నాలజీ) మూల స్తంభాలుగా మారుతున్నాయి. కోట్లాది మంది ప్రజలు ప్రభుత్వ సేవలు, సమాచారం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థను పొందే విధానాన్ని ఇవి తీర్చిదిద్దుతున్నాయి. ఈ నేపథ్యంలో 2026 ఫిబ్రవరి 20న 'ఇండియా ఏఐ సదస్సు ఎక్స్‌పో 2026'లో స్వర సాంకేతికతలపై కొత్త 'విధాన నివేదిక', 'డెవలవర్స్ టూల్ కిట్'ను ఆవిష్కరించారు. పారదర్శక, సమ్మిళిత, బాధ్యతాయుతమైన స్వర సాంకేతికతలకు మద్దతు ఇచ్చేలా ఒక విధానపరమైన ఆచరణాత్మక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడం ఈ నివేదిక ప్రధాన లక్ష్యం.

ఈ విధాన నివేదిక, డెవలపర్స్ టూల్‌కిట్‌లను ఐఐఎస్‌సీకి చెందిన ఆర్ట్‌పార్క్, డిజిటల్ ఫ్యూచర్స్ ల్యాబ్, ట్రైలీగల్ సంస్థలు సంయుక్తంగా రూపొందించాయి. వీటికి భాషిణి, ఫేర్ ఫార్వర్డ్ ఏఐ ఫర్ ఆల్ కార్యక్రమాలు మద్దతు లభించింది. జర్మనీ దేశ ఆర్థిక సహకారం- అభివృద్ధి మంత్రిత్వ శాఖ (బీఎంజెడ్) నిధులతో జీఐజెడ్ (జర్మన్ డెవలాప్‌మెంట్ కోఆపరేషన్) ఈ ప్రాజెక్టును అమలు చేసింది. భారత్‌లో బాధ్యతా యుతమైన స్వర సాంకేతికతలను ప్రోత్సహించేందుకు పరిశోధన, సాంకేతిక నైపుణ్యం, వ్యవస్థల మధ్య సహకారాన్ని పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశం.

భారత్ వంటి విభిన్న భాషలు కలిగిన దేశంలో స్వర సాంకేతికతలు 'డిజిటల్ ప్రజా మౌలికసదుపాయాల్లో ' కీలకమైన భాగం. ఇవి మాటల ఆధారిత అప్లికేషన్ల ద్వారా సామా న్యులు డిజిటల్ సేవలను పొందటాన్ని మరింత సులభతరం చేస్తాయి. అయితే ఈ స్వర సాంకేతికలను అభివృద్ధి చేయడం, అమలు చేయడం వల్ల సమాచార నిర్వహణ, సమ్మిళితత్వం, పారదర్శకత, నాణ్యత, బాధ్యతాయుతమైన వినియోగం వంటి అంశాలపై అనేక క్లిష్టమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ సవాళ్లను పరిష్కరించాలంటే విధానపరమైన ఫ్రేమ్‌వర్క్‌లు, సాంకేతిక పద్ధతులు, వ్యవస్థల సమన్వయం వంటి అంశాల్లో సరైన అనుసంధానం అవసరం.

ఈ విధాన నివేదిక భారత్‌లో పారదర్శక, బాధ్యతాయుతమైన స్వర వ్యవస్థల నిర్మాణంలో ఎదురవుతున్న కీలక అడ్డంకులను విశ్లేషిస్తుంది. ఇందులో డేటా సేకరణ, మోడల్ అభివృద్ధి నుంచి మౌలిక సదుపా యాలు, పరిపాలన పద్ధతుల వరకు అన్ని అంశాలు ఉన్నాయి. ప్రాథమిక స్వర డేటాసెట్‌లను 'డిజిటల్ పబ్లిక్ గుడ్స్'గా పరిగణించడం, ఏఐ మోడళ్లలో పారదర్శకత- అన్ని వర్గాల ప్రాతినిధ్యాన్ని పెంచడం, సుస్థిర ప్రజా మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టడం, ఆవిష్కరణలను ప్రోత్సహి స్తూనే సాంకేతికత దుర్వినియోగం కాకుండా తగిన రక్షణ చర్యలను ఏర్పాటు చేయడంతో సహా స్వర-సాంకేతికత వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇది నిర్దిష్ట విధానపరమైన సిఫార్సులను ప్రతిపాదిస్తోంది.

విధాన విశ్లేషణకు ఈ 'డెవలపర్స్ టూల్‌కిట్' అదనపు బలాన్ని చేకూరు స్తుంది. భారతీయ భాషల స్వర డేటాసెట్‌లతో పనిచేసేటప్పుడు, స్వర అప్లికేషన్లను రూపొందిం చేటప్పుడు డెవలపర్లు ఎదుర్కొం టున్న ప్రధాన సవాళ్లపై ఇది పనిచేస్తుంది. అసమాన డేటా ప్రాతినిధ్యం, నాణ్యత హామీ విషయంలో బలహీనమైన యంత్రాం గాలు, పరిమితమైన మూల్యాంకన (ఎవల్యూషన్) పద్ధతులు, విచ్ఛిన్నంగా ఉన్న ప్రభుత్వ యంత్రంగంతో సహా భారతదేశపు స్వర, భాషా సాంకే తికల వ్యవస్థలో ఉన్న నిర్మాణాత్మక లోపాలను ఇది గుర్తించింది. సాంకేతిక అభివృద్ధి ప్రక్రియలోని వివిధ దశల్లోనే ప్రత్యేకమైన ఫలితాలు వస్తాయన్న విషయాన్ని గుర్తిస్తూ ఈ టూల్‌కిట్.. ఒక 'అంచలపరమైన పూర్తి జీవిత కాల' విధానాన్ని పరిచయం చేస్తోంది. దీని ద్వారా సమ్మిళిత, పటిష్టమైన స్వర ఏఐ వ్యవస్థలను తయారుచేయొచ్చు. ఒక డిజిటల్ ఉత్పత్తి విషయంలో ఆలోచన నుంచి దాని ఉపయోగించటం వరకు ఎదు రయ్యే సవాళ్లను పరిష్కరిం చడానికి ప్రస్తుతం భారత్‌లోని స్వర-సాం కేతికత రంగంలో అనుసరిస్తున్న ఆచరణాత్మక పద్ధతులను ఈ టూల్‌కిట్ వివరిస్తుంది.

"భారతదేశం 'స్వర ఆధారిత సేవలు ప్రథమం (వాయిస్ ఫస్ట్)' డిజిటల్ వ్యవస్థ దిశగా వేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో ఈ మార్పును బలమైన విధానపరమైన పునాదులు, ఆచరణాత్మక అమలు ఫ్రేమ్‌వర్క్‌లతో నిర్మించడం అత్యంత అవసరం. అపారమైన భాషా వైవిధ్యం ఉన్న మన దేశంలో స్వర సాంకేతికలు కేవలం ఒక ఆవిష్కరణ మాత్రమే కాదు.. అవి డిజిటల్ సమ్మిళితత్వానికి సాధనాలు. నేడు ఆవిష్కరించిన 'విధాన నివేదిక', 'డెవలపర్స్ టూల్‌కిట్' భారత్‌లో పారదర్శక, సమ్మిళిత, బాధ్యతాయుతమైన స్పీచ్ సాంకేతికతలను నిర్మించడానికి ఒక క్రమబద్ధమైన రోడ్‌మ్యాప్‌ను అందిస్తాయి. వ్యవస్థల మధ్య సమన్వయానికి విధానపరమైన సిఫార్సులు మార్గనిర్దేశం చేస్తే.. ఆ సూత్రాలను ఏఐ జీవన చక్రంలోని ప్రతి దశలోనూ అంటే డేటా సేకరణ, మోడల్ అభివృద్ధి నుంచి ఉపయోగం, నిర్వహణ వరకు ఆచరణాత్మక పద్ధతులుగా డెవలపర్స్ టూల్‌కిట్ మారుస్తుంది. స్వర సాంకేతికతలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ వాటి ప్రమాణాలు, మూల్యాంకన ఫ్రేమ్‌వర్క్‌లు, సాంకేతిక టూల్‌కిట్లు కూడా నిరంతరం మారుతూ ఉంటాయి. స్వర ప్రయాణాన్ని సులభతరం చేయడానికి, బహుభాషా మద్దతును అందించేందుకు, పరస్పర మార్పు కోసం ప్రస్తుతం ఉన్న డిజిటల్, ఐటీ మౌలిక సదుపాయాలను వ్యవస్థగతంగా తిరిగి పునర్నిర్మించాల్సి ఉంటుంది. వ్యవస్థలోని భాగస్వాము లందరి సామూహిక కృషి ద్వారా భారత 'డిజిటల్ ప్రజా మౌలికసదు పాయాల్లో' స్వరాన్ని ఒక కీలకమైన పునాదిగా మార్చొచ్చు. తద్వారా భాషా పరమైన అక్షరాస్యత, డిజిటల్ అంతరాలను భారీ స్థాయిలో అధిగ మించగలమని వేం విశ్వసిస్తున్నాం" - శ్రీ అమితాబ్ నాగ్, సీఈఓ, డిజిటల్ ఇండియా భాషిణి విభాగం.

"ఈ నివేదిక విధాన నిర్ణేతలు, సాంకేతిక నిపుణులకు ఉపయోగపడే అనేక ఉత్తమ పద్ధతులు, అనుభవంతో కూడిన పాఠాలతో నిండి ఉంది. డిజిటల్ సమ్మిళితత్వం పట్ల మాకున్న ఉమ్మడి దార్శనికతను ముందుకు తీసుకెళ్లడం, డిజిటల్ అంతరాలను తగ్గించడం బీఎంజెడ్ లక్ష్యం. ముఖ్యంగా అక్షరాస్యత తక్కువగా ఉన్నవారికి లేదా డిజిటల్ మౌలిక సదుపాయాలు తక్కువగా అందుబాటు లో ఉన్న కోట్లాది మంది ప్రజలకు డిజిటల్ ప్రపంచంలోకి ప్రవేశించ డానికి 'స్వరం' అత్యంత సహజమైన, శక్తిమంతమైన సాధనం. స్వర ఏఐ(వాయిస్ ఏఐ) అనేది స్థానిక భాషలు, మాండలికాల్లో పనిచేసినప్పు డు అది ప్రభుత్వ సేవలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఆర్థిక భాగస్వా మ్యానికి ఒక ముఖద్వారంగా మారుతుంది''- డాక్టర్ అరియాన్ హిల్డెబ్రా ండ్ట్, డైరెక్టర్ జనరల్, ప్రపంచ ఆరో గ్యం- అవకాశాల సమానత్వం- డిజిటల్ సాంకేతికతలు- ఆహార భద్రత విభాగం, జర్మనీ దేశ ఆర్థిక సహకారం- అభివృద్ధి మంత్రిత్వ శాఖ

భాషావేత్తలు, సాంకేతిక నిపుణు లు, ఏఐ నైతికత నిపుణులతో జరిగిన వరుస చర్చల ద్వారా ఈ విధాన నివేదిక, డెవలపర్స్ టూల్‌కిట్‌ను రూపొందించారు. భారత్‌లో కమ్యూనికేషన్ అంతరాలను తొల గించడానికి.. భాషా పరమైన, డిజిటల్ అడ్డంకులను అధిగమిం చడానికి 'భాషిణి' చేపట్టిన 'స్వర ఆధారిత సేవలు ప్రథమం (వాయిస్ ఫస్ట్)' అనే బహుభాషా పరిష్కారాల విస్తృత కార్యకలా పాల్లో ఇవి ఒక ముఖ్యమైన భాగంగా నిలుస్తుంది.

భాషిణి అనేది ఏఐ ఆధారిత భాషా అనువాద వేదిక. ఇది అక్షరాస్యత, భాష, డిజిటల్ అంతరాలను తొలగిస్తుంది. 'స్వర ఆధారిత సేవలు ప్రథమం (వాయిస్ ఫస్ట్)' అనే బహుభాషా పరిష్కారాల ద్వారా భాషతో పాటు సాంకేతికతను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడం, సహకారం - ఆవిష్కరణలను ప్రోత్సహించే అతిపెద్ద 'కో-క్రియేషన్ ఏఐ ప్లాట్‌ఫాం'గా నిలవడం.. భాషా, అక్షరాస్యత, డిజిటల్ అడ్డంకులను తొలగించి అందరికీ సమాన అవకా శాలను కల్పించడంతో సహా వినూత్నమైన స్వర ఆధారిత బహుభాషా ఏఐ పరిష్కారాల ద్వారా భాషిణి సమాచార రంగాన్ని సరికొత్తగా మారుస్తోంది.

జీఐజెడ్ (జర్మనీ సొసైటీ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్) అనేది అంతర్జాతీయ సహకార రంగంలో 50 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఒక జర్మన్ ప్రభుత్వ సంస్థ. జర్మనీ దేశ ఆర్థిక సహకారం, అభివృద్ధి మంత్రిత్వ శాఖ (బీఎంజెడ్) తరపున జీఐజెడ్ 'ఫేర్ ఫార్వర్డ్ - అందరికీ కృత్రిమ మేధ' అనే ప్రాజెక్టును అమలు చేస్తోంది. ఈ ప్రాజెక్ట్ ప్రపంచవ్యాప్తంగా ఏఐ పట్ల మరింత పారదర్శక, సమ్మిళిత, సుస్థిర విధానాన్ని రూపొందించడానికి కృషి చేస్తుంది.

ఆర్ట్‌పార్క్ అనేది ఒక అంకుర ఇంక్యుబేషన్, యాక్సిలరేటర్ కార్యక్రమం. ఆవిష్కరణ స్థాయి నుంచి అంకుర స్థాయి వరకు ఎదిగే ప్రక్రియను ఇది సులభతరం చేస్తుంది. పరిశోధన రంగంలోని ఆవిష్కర ణలను సామాన్యుల రోజువారీ సవాళ్లను పరిష్కరించే విధంగా మార్చడం దీని ముఖ్య ఉద్దేశం. ముఖ్యంగా ఏఐ, రోబోటిక్స్ వ్యవస్థలో ప్రయోగశాలల్లోని ఆలోచనలను మార్కెట్‌కు చేరవేయడానికి ఇది ఒక వారధిలా పనిచేస్తుంది.

డిజిటల్ ఫ్యూచర్స్ ల్యాబ్ అనేది ఒక స్వతంత్ర, బహుళ విభాగాల పరిశోధనా సంస్థ. ఇది భారత్, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సాంకేతికత, సమాజం మధ్య ఉన్న సంక్లిష్ట సంబంధాన్ని అధ్యయనం చేస్తుంది. సాక్ష్యాధారాలతో కూడిన పరిశోధన, ముందుచూపు, ప్రజా భాగస్వామ్యం ద్వారా సమానమైన, సురక్షితమైన, సుస్థిర డిజిటల్ భవిష్యత్తును నిర్మించడానికి డీఎఫ్ఎల్ కృషి చేస్తుంది.

ట్రైలీగల్ అనేది భారత్‌లో 25 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న ఒక సమగ్ర న్యాయ సేవల సంస్థ. ఈ సంస్థ ఫార్చ్యూన్ 500 కంపెనీలు, అంతర్జాతీయ పెట్టుబడి నిధులు, ప్రముఖ భారతీయ కార్పొరేట్ సంస్థలు, స్వదేశీ- అంతర్జాతీయ బ్యాంకులు, సాంకేతిక- మీడియా సంస్థలు, కుటుంబ కార్యాలయాలు, ఉన్నత స్థాయి సంపన్నులతో కూడిన విభిన్న సంస్థలు, వ్యక్తులకు న్యాయ పరమైన సలహాలను అందిస్తుంది.

భారత్‌లోని 280 బిలియన్ డాలర్లకు పైగా విలువైన సాంకేతిక పరిశ్రమకు నాస్కామ్ ప్రాతినిధ్యం వహిస్తోంది. దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి సాంకేతిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే దీని ప్రధాన లక్ష్యం. పరిశ్రమలోని వివిధ రంగాలకు చెందిన 3,500 కంటే ఎక్కువ సభ్య సంస్థలతో కూడిన ప్రతిభావంతులను ఇది ఏకం చేస్తోంది. భారతదేశపు ఏఐ వ్యవస్థ గొంతుకగా నాస్కామ్ ఏఐ వ్యవహరిస్తోంది. దేశంలో శక్తిమంతమైన, వినూత్నమైన, సుస్థిరమైన ఏఐ రంగాన్ని పెంపొం దించడానికి నాస్కామ్ చేపట్టిన ఒక వ్యూహాత్మక కార్యక్రమం ఇది. ఏఐ సామర్థ్యాలను పెంపొందించటం, వివిధ రంగాల్లో ఏఐ వినియోగాన్ని వేగవంతం చేయటం, బాధ్యతాయుతమైన ఏఐ అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఇది ఒక ఉమ్మడి వేదికగా పనిచేస్తుంది.

## ఎస్ ఎంసీలో రెండు యూరాలజీ సీట్లు

### -జాతీయ వైద్య కమిషన్ ఆమోదం
### -ప్రాంతీయ ఆరోగ్య రంగానికి కీలక మైలురాయి
### -నైపుణ్య వైద్యుల తయారీలో ముందడుగు
### -అధ్యాపక బృందానికి ప్రిన్సిపాల్ అభినందనలు

అమరావతి, ఫిబ్రవరి 22: ఏపీ ప్రజలకు ఉన్నత వైద్య సేవలు, నైపుణ్య వైద్యుల తయారీకి ఊతం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించింది. విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాలలో యూరాలజీ విభాగంలో సూపర్ స్పెషాలిటీ పీజీ కోర్సు ప్రారంభానికి జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతి లభించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంనుంచి ఈ కోర్సుకు రెండు సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు మంజూరు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. యేదుకొండలరావు తెలిపారు.

యూరాలజీ అంటే మూత్రపిండాలు, మూత్ర మార్గం, పురుష వ్యవస్థకు సంబంధించిన వ్యాధుల చికిత్సలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వైద్య విభాగం. ఈ విభాగంలో ఉన్నత స్థాయి వైద్య విద్య ప్రారంభం కావడం కళాశాలకు మాత్రమే కాకుండా ప్రాంతీయ ఆరోగ్య రంగానికి కీలక మైలురాయిగా భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా యూరాలజీ విభాగం అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, ఆధునిక సదుపాయాల ఏర్పాటుతో ఈ గుర్తింపు సాధ్యమైందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా యూరాలజీ విభాగాధిపతి డా. శ్రీధర్‌తో పాటు విభాగంలోని అధ్యాపక సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు. అలాగే వైస్ ప్రిన్సిపల్స్ డా. ప్రశాంతి, డా. గోవింద్, డా. ప్రభాకర్ తదితరులు కూడా కళాశాల యాజమాన్యానికి, యూరాలజీ విభాగానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ అనుమతి ద్వారా కళాశాలలో సూపర్ స్పెషాలిటీ వైద్య విద్య బలోపేతం అవుతుందని, భవిష్యత్తులో నైపుణ్య వైద్యులు తయారై రాష్ట్ర ప్రజలకు ఉన్నత స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి.

# ఉయ్యాలవాడ అమర్ రహే

## ఆంగ్లేయులపై సమర సింహనాదం



మచిలీపట్నం, ఫిబ్రవరి 22: సిపాయిల తిరుగుబాటుకు ముందే ఆంగ్లేయుల పాలనను ఎదిరించి పోరాడిన తొలి తెలుగు స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కొనియాడారు. ఆదివారం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. .సిపాయిల తిరుగుబాటు 1857 సంవత్సరంలో జరిగిన విషయం అందరికీ తెలిసిందేనని, ఆ పోరాటానికి 10 ఏళ్ల ముందే ఆంగ్లేయులు విధించిన అన్యాయమైన శిస్తులను భూవివాదాలకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 1847 సంవత్సరంలోనే తిరుగుబాటు చేసి చివరకు వీరమరణం పొందారన్నారు.ఆంగ్లేయుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసి తెలుగువారి పౌరుషాన్ని చాటి చెప్పిన అపరవీరుడని కలెక్టర్ ప్రశంసించారు.ఆయన వీరోచిత పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిటిడబ్ల్యుఓ ధూర్జటి ఫణి,కలెక్టరేట్ డిప్యూటీ కలెక్టర్ నారాయణ, పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లాలో విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్

## -పది ద్విచక్ర వాహనాలు, పది లీటర్ల నాటు సారా స్వాధీనం



చిత్తూరు, ఫిబ్రవరి 22: ప్రజల భద్రత, రక్షణను ప్రధాన లక్ష్యంగా తీసుకొని నేరాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ చర్యలు చేపట్టారు. జిల్లా పోలీసు అధికారి తుషార్ డూడి ఆదేశాల మేరకు అన్ని విభాగాల పోలీసులు సమన్వయంతో ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

జిల్లాలోని ముఖ్య ప్రాంతాలు, పట్టణాలు, గ్రామాలు, రహదారులు, చెక్ పోస్టుల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై కఠినంగా తనిఖీలు నిర్వహించగా, నేరస్థుల కదలికలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. అక్రమ రవాణా నిరోధానికి ప్రత్యేక దృష్టి సారించి పోలీసులు విస్తృతంగా పరిశీలనలు చేశారు. ఆదివారం నిర్వహించిన తనిఖీలలో పది ద్విచక్ర వాహనాలు, పది లీటర్ల ఐడి సారా స్వాధీనం చేసుకున్నారు.

ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యం నేరాలను ముందస్తుగా అరికట్టడం, ప్రజల్లో భద్రతా వాతావరణాన్ని మరింత బలపరచడం అని అధికారులు తెలిపారు. ప్రతి ప్రాంతంలో పోలీసుల సాన్నిధ్యం స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా వాహనాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు.

అదే సమయంలో ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, రవాణా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు తెలియజేశారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాలకు ప్రమాదంగా మారుతుందని హెచ్చరించారు.

జిల్లావ్యాప్తంగా పోలీసు విభాగం సమన్వయం, స్థానిక ప్రజల సహకారంతో ఈ విస్తృత తనిఖీలు విజయవంతంగా పూర్తయ్యాయి. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలను నిరంతరం కొనసాగించి ప్రజల భద్రతకు మరింత ప్రాధాన్యత ఇస్తామని పోలీసులు వెల్లడించారు.

## కారు ఢీకొని వృద్ధుడు దుర్మరణం

నల్గొండ, ఫిబ్రవరి 22: కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కారు ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందినట్లు కమ్మర్ పల్లి ఎస్ఐ జి. అనిల్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ జి. అనిల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కమ్మర్ పల్లి మండల కేంద్రానికి చెందిన ఎర్రోళ్ల లస్మయ్య ( 75 ) టీవీఎస్ ఎక్సల్ పై తన నివాసమైన కేసీఆర్ కాలనీకి తిరిగి వస్తుండగా మోర్తాడ్ వైపు నుండి కమ్మర్ పల్లి వైపు వస్తున్న టాటా టిగోరు కారు ఢీకొట్టిందనీ తెలిపారు. అతివేగం గా,అజాగ్రత్తగా కారు నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో లస్మయ్య కు తీవ్ర గాయాలయి ఆక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

# పెరిక కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి..




నిర్మల్, ఫిబ్రవరి 22: పెరిక పురగిరి క్షత్రియ కులస్తులు అందరు ఐక్యంగా ఉండి సంఘం అభివృద్ధికి పాటుపడుతూ అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర పెరిక పుంగిరి క్షత్రియ కుల సంఘం అధ్యక్షులు డాక్టర్ గ టిక.విజయ్ కుమార్ అన్నారు. కడెం మండలంలోని కొందుకూర్ గ్రామంలో గల పవనసుత రైస్ మిల్ వద్ద జరిగిన నిర్మల్ జిల్లా పెరిక పురగిరి క్షత్రియ కుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు చుంచు భూమన్న అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి విజయకుమార్ హైదరాబాద్ లోని బీసీ కులాల స్థలాలలో ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ కులాల వారికి కులాలవారీగా నిధులు రిజర్వేషన్లు కేటాయించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పెరిక కులస్తుల అభివృద్ధికి కోకాపేట బిల్డింగ్ హాస్టల్ వసతులు కల్పించి పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఉత్సహిస్తున్నామన్నారు.

పెరిక కుల బాంధవులందరూ ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యమ్ లింగన్న వసతి గృహాల అధ్యక్షులు డాక్టర్ డి వెంకటేశ్వర్లు అసోసియేట్ అధ్యక్షులు సుంకరి ఆనంద్ కోశాధికారి ఎస్ లింగన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల వేణుగోపాల్ ఎ కార్యనిర్వాహక సంయుక్త కార్యదర్శి కే విజయ్ కుమార్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బొడ్డు బుచ్చన్న రాష్ట్ర నాయకులు లాసెట్టి శేఖర్ కడెం దస్తురాబాద్ ఖానాపూర్ మండలాల అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్ లాసెట్టి శ్రీనివాస్ నిర్మల్ జిల్లాలో నుండి వివిధ మండలాల నుండి గ్రామాల నుండి వచ్చిన పెరిక కుల సంఘము నాయకులు కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాలయంలో కేంద్రమంత్రి

## -అనంతరం జోగులాంబ సన్నిధికే పయనం
## -జిల్లాలో పరిశ్రమల పురోగతిపై మంత్రికి కలెక్టర్ సిరి వివరణ



అమరావతి, ఫిబ్రవరి 22: కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం కర్నూలు విమానాశ్రయానికి విచ్చేసిన కేంద్ర భారీ పరిశ్రమలు మరియు ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామికి జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆత్మీయ స్వాగతం పలికారు.

తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ అమ్మవారి దేవాలయం, మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి దర్శనం నిమిత్తం కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర మంత్రిని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గంలో అలంపురం బయలుదేరి వెళ్లారు.అలంపురంలో వెలసిన జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నారు. జిల్లాలో ఏర్పాటు కానున్న పరిశ్రమలు, ఇతర అభివృద్ధి పనుల పురోగతి అంశాలపై జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డీఎస్పీ బాబు ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మించిన 'క్షమత భవన్ ను ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 22: హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఏఏఆర్ఎం) లో క్షమత భవన్ ను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు (2026 ఫిబ్రవరి 21) ప్రారంభించారు. ఐసీఏఆర్ - నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన తరుణంలో ఈ భవనం ప్రారంభం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. క్షమత భవన్ ఐసీఏఆర్- ఎన్ఏఏఆర్ఎం మౌలిక సదుపాయాలకు ఒక ముఖ్యమైన జోడింపు. ఈ భవనం కేవలం ఒక కట్టడమే కాకుండా, వ్యవసాయ రంగంలోని వివిధ భాగస్వాముల, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కేంద్రంగా పనిచేస్తుంది.

# భారత మాయాజాల ప్రపంచపు అగ్రశిఖరం...ప్రోతుల్ చంద్ర సర్కార్

**-ఫిబ్రవరి 23.. పి.సి. సర్కార్ జయంతి**



పి.సి. సర్కార్ భారత దేశపు అత్యంత ప్రఖ్యాత ఇంద్రజాలికుడు. 20వ శతాబ్దంలో "ఇండియన్ హౌడిని" గా పేరుగాంచిన ఆయన, భారతీయ ఇంద్రజాల కళను ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప కళాకారుడు. అతని వినూత్నమైన ప్రదర్శనలు, అత్యద్భుతమైన మాయా కౌశల్యాలు, భారతీయ సంప్రదాయాన్ని ఇంద్రజాలలో కలిపిన విధానం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. ప్రోతుల్ చంద్ర సర్కార్ 23 ఫిబ్రవరి 1913న ఆసిక్‌పూర్, తాంగాయిల్ జిల్లా, బ్రిటీష్ ఇండియా (ప్రస్తుతం బంగ్లాదేశ్)లో జన్మించారు. ఆయన తండ్రి కూడా ఒక ఇంద్రజాల కళాకారుడు. చిన్నతనం లోనే ఇంద్రజాల కళపై ఆసక్తిని పెంపొందించుకున్నాడు.

పి.సి. సర్కార్ తన మాయా ప్రదర్శనల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్నాడు. ఆయన భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించి, హైప్నోటిక్ మంత్రాలతో ప్రేక్షకులను ఆశ్చర్య పరిచేవాడు. ఆయన "సా-రే-గా-మా" మాయా ట్రిక్ - ప్రపంచ ప్రసిద్ధమైన మాయాజాల ప్రదర్శనలలో ఒకటి."ఎగిరే కత్తి" ప్రదర్శన-గాల్లో తేలే కత్తి విన్యాసం."ఇంద్రజాల దర్పణం" - ఆయనే ఓ సజీవ కడగండ్లుగా మారినట్టు ప్రదర్శిం చేవాడు. "జిగ్‌సా మానవుడు" ? శరీరాన్ని ముక్కలుగా విభజించినట్టు చూపించే మాయాజాలం. "గోల్డెన్ ఫీష్ ట్రిక్" ? ఖాళీ పాత్రలో నీటిని బంగారు చేపలుగా మారుస్తాడు.

ఆయన యూరోప్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, రష్యా వంటి అనేక దేశాలలో ప్రదర్శనలు ఇచ్చాడు. 1950లలో లండన్ మరియు టోక్యోలో అతని ప్రదర్శనలు విశేష ప్రజాదరణ పొందాయి. 1956లో "ది గ్రేట్ ఇండియన్ ఇల్యూజనిస్ట్" అనే బిరుదును పొందాడు.

1964లో పద్మశ్రీ పురస్కారం - భారత ప్రభుత్వం ఈ గౌరవాన్ని అందజేసింది. ఇంద్రజాలంపై అనేక పుస్తకాలను రచించాడు. ఆయన కుమారుడు కూడా ప్రఖ్యాత ఇంద్రజాలికుడు. భారతీయ ఇంద్రజాల కళను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఘనత సాధించాడు. భారతీయ సంప్రదాయాలను మాయాజాలంతో మిళితం చేసి "ఇండియన్ స్టైల్ ఇల్యూజన్" అనే ప్రత్యేక శైలిని అందించాడు. భారతదేశంలో ఇంద్రజాల కళ ప్రాచుర్యం పొందేలా చేశాడు. 6 జనవరి 1971, హొక్కైడో, జపాన్ లో మరణించాడు. ఆయన కుమారుడు పి.సి. సర్కార్ (జూనియర్) తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆధునిక ఇంద్రజాల కళకు కొత్త పుంతలు తొక్కుతున్నాడు. భారతదేశంలో ఇప్పటికీ పి.సి. సర్కార్ పేరు గౌరవప్రదంగా చెప్పబడుతోంది.

పి.సి. సర్కార్ భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప మాయాజాల కళాకారుడు. ఆయన మాయాజాలం కేవలం వినోదం మాత్రమే కాదు; అది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసిన గొప్ప సాధనం. ఆయన ప్రదర్శనలు, ట్రిక్స్, పుస్తకాలు ఇంద్రజాల కళను ప్రేమించే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి."ఇంద్రజాలం ఒక కళ మాత్రమే కాదు- అది మానసిక మేధస్సును విప్పి చూపే అద్భుత ప్రపంచం!" -పి.సి. సర్కార్



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# స్వయం సహాయక సంఘాల మహిళలకిచ్చే రుణాలు

# దేశం కోసం సురక్షితమైన పెట్టుబడి: శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 22: భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ రోజు హైదరాబాద్‌లో జాతీయ ఆర్థిక అక్షరాస్యత-సమర్థత సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో విధాన నిర్ణేతలు, నియంత్రణ సంస్థలు, ఆర్థిక సంస్థలు, రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్లు (ఎస్‌ఆర్‌ఎల్‌ఎమ్‌లు), కమ్యూనిటీ నాయకులు పాల్గొన్నారు. సదస్సులో ఆర్థిక అవగాహనను బలోపేతం చేయడం, కుటుంబాల ఆర్థిక సామర్థ్యాన్ని పెంపొందించడం, గ్రామీణ భారత్ అంతటా సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించడం గురించి చర్చించారు.

ఈ సమావేశంలో ఆర్థిక అక్షరాస్యత, కుటుంబాల స్థాయిలో ఆర్థిక సామర్థ్యం, జీవనోపాధి-వ్యాపారాల కోసం రుణాల లభ్యతను మరింత విస్తరించడం వంటి అంశాలను చర్చించారు. నిరంతర ఆర్థిక అవగాహన, లోతైన ఆర్థిక సమ్మిళితత్వం, బలమైన సంస్థాగత కలయికల ప్రాముఖ్యాన్ని చర్చలు స్పష్టం చేశాయి. స్వయం సహాయక బృందాలు, వాటి సమాఖ్యల వంటి కమ్యూనిటీ ఆధారిత సంస్థలను... ఆర్థిక సేవలు, ఆర్థిక అవగాహన వ్యాప్తి కోసం విశ్వసనీయమైన, గణనీయ సామర్థ్యం గల వేదికలుగా గుర్తించారు.

25వ కేంద్ర స్థాయి సమన్వయ కమిటీ (సీఎల్‌సీసీ) సమావేశం ఈ రోజు హైదరాబాద్‌లో జరిగింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అంతటా విధానపరమైన చర్చలను కొనసాగించడం, ఆయా వ్యవస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంలో కీలక ముందడుగును ఈ సమావేశం సూచిస్తుంది.

ఈ సమావేశానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి, సీసీఎల్‌సీ చైర్‌పర్సన్ శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, తెలంగాణ ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి శ్రీమతి డి. అనసూయ సీతక్క హాజరయ్యారు.

ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. వీరిలో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీ శైలేష్ కుమార్ సింగ్, అదనపు కార్యదర్శి శ్రీ టి. కె. అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శులు శ్రీమతి స్మృతి శరణ్, శ్రీమతి స్వాతి శర్మ ఉన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎన్. శ్రీధర్... ఆ శాఖ కమిషనర్, సెర్ప్ తెలంగాణ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీమతి దివ్య దేవరాజన్ సహా తెలంగాణ ప్రభుత్వం నుంచి సీనియర్ అధికారులు, నాబార్డ్, ఆర్‌బిఐ, బ్యాంకులు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకు, వివిధ రాష్ట్రాల స్వయం సహాయక సంఘాల ప్రతినిధులూ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జాతీయ సదస్సు నుంచి కీలక అంశాల ప్రస్తావనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి స్మృతి శరణ్ "డీఏఐ-ఎన్‌ఆర్‌ఎల్‌ఎమ్ వ్యూహాత్మక అంశాలు, భవిష్యత్ రోడ్ మ్యాప్" అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, నియంత్రణ సంస్థలు, బ్యాంక్ సఖిలు, బీసీ సఖిలు, ఆర్థిక అక్షరాస్యత కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, బీమా సఖిలు సహా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌ల ప్రతినిధులను ఉద్దేశించి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రసంగించారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీని బలోపేతం చేయడం, ఔత్సాహిక వ్యక్తిగత మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతునిచ్చే విధానాన్ని అనుసరించాల్సిన ప్రాముఖ్యాన్ని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు అందించడం నష్టం కాదనీ... దేశానికి అత్యంత సురక్షితమైన పెట్టుబడుల్లో ఒకటని ఆయన పేర్కొన్నారు. మహిళల నేతృత్వంలోని సంస్థల పరివర్తన సామర్థ్యాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ... వాటాదారులందరి సమష్టి మద్దతుతో, "దీదీలు" లఖ్‌పతి దీదీల నుంచి కోటీశ్వరులుగా పురోగమించగలరని అన్నారు. తద్వారా మహిళల నేతృత్వంలోని గ్రామీణ పరివర్తన వేగవంతమై, వికసిత్ భారత్ దార్శనికతకు గణనీయ తోడ్పాటు లభిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

గ్రామీణ కుటుంబాలన్నింటికీ ఆర్థిక వనరుల లభ్యతను బలోపేతం చేయడం, వ్యాపారాలకు ఆర్థిక సహాయాన్ని విస్తరించడం, నష్టం నుంచి రక్షించే విధానాలను మెరుగుపరచడం వంటి అవసరాలను కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

రుణాల పంపిణీని సులభతరం చేయడం, డిజిటల్ ఫైనాన్స్ అమలును ప్రోత్సహించడం, గ్రామీణ మహిళల్లో ఆర్థిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలను రూపొందించారు.

గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీ శైలేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ... ఆర్థిక సమ్మిళితత్వం, వ్యాపార వృద్ధి, ఆర్థిక సామర్థ్యాలను కొనసాగించడంలో కమ్యూనిటీ సంస్థల కీలక పాత్రను స్పష్టం చేశారు.

భారత ఆర్థిక సమ్మిళితత్వ ప్రయాణం ఇప్పుడు వ్యాపార ఆధారిత సాధికారతగా పరిణామం చెందాలనీ... ఆర్థిక వనరుల లభ్యత నుంచి ఉత్పాదక క్రెడిట్, వ్యాపారాలకు ప్రోత్సాహం, సుస్థిరమైన ఆర్థిక సామర్థ్యం వైపు దృష్టిని మళ్లించాలని డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని పిలుపునిచ్చారు.

శ్రీమతి డి. అనసూయ సీతక్క మాట్లాడుతూ... తెలంగాణ దేశంలోనే అత్యంత తక్కువ వయస్సు గల రాష్ట్రమైనప్పటికీ, ఇది పాతకాలం నాటి రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎస్‌ఆర్‌ఎల్‌ఎమ్)ను అనుసరిస్తోందన్నారు. మిషన్ ఆధారిత కార్యక్రమాలు తెలంగాణ మహిళలు తదుపరి దశ వ్యాపార ఏర్పాటుకు నాయకత్వం వహించడానికి వీలు కల్పిస్తాయని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకింగ్ సంస్థలకు పురస్కారాలను అందించడం ద్వారా ఆర్థిక సంస్థల సహకారాన్నీ గుర్తించింది.

గ్రామీణ భారతం అంతటా సమ్మిళిత వృద్ధిని వేగవంతం చేయడానికి, ఆర్థిక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, సమ్మిళిత వృద్ధిని వేగవంతం చేయడానికి వాటాదారుల ఉమ్మడి నిబద్ధత ప్రకటనతో సమావేశం ముగిసింది.

# అడ్వాన్స్‌డ్ ఆంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ రంగాల్లో పరిశోధనల

# వేగవంతానికి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అవసరం: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 22: రోగనిర్ధారణలో సంశయాలకు, వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేకుండా ఏఐ ఆధారిత పరికరాలు పనిచేసాయని, ఇవి రోగులకు మరింత కచ్చితమైన, నిర్దిష్టమైన చికిత్స అందేలా చేస్తాయని శాస్త్ర, సాంకేతిక, ఎర్త్ సైన్సెస్ శాఖ స్వతంత్ర హోదా సహాయ మంత్రి, ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి అంతరిక్ష విభాగాల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

ఉదాహరణకు, క్యాన్సర్ రోగి బయాప్సీ స్లైడ్‌ను పాథాల జిస్ట్ కంటితో పరీక్షించేటప్పుడు సూక్ష్మమైన కణ సమూహాలను గుర్తించడంలో పొరపాట్లు జరగవచ్చని, కానీ ఏఐ ఆధారిత వ్యవస్థ ఆ కణాలు ఉన్న కచ్చితమైన ప్రాంతాన్ని నేరుగా చూపిస్తూ, మానవ తప్పిదాలను తగ్గిస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. "మెడిల్యూమినా 2026: ఇంటర్నేషనల్ మల్టీ స్పెషాలిటీ మెడికల్ కాన్ఫరెన్స్" ప్రారంభోత్సవంలో మంత్రి ప్రసంగించారు. అదేవిధంగా, క్లినికల్ పరీక్షల సమయంలో రోగికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని విశ్లేషించే ఏఐ పరికరాలు సాధారణంగా కంటికి కనిపించని అంశాలను కూడా గుర్తించి హెచ్చరిస్తాయి. దీనివల్ల రోగనిర్ధారణ కచ్చితత్వం పెరగడమే కాకుండా, చికిత్సలో మెరుగైన ఫలితాలు లభిస్తాయని ఆయన తెలిపారు.

సమగ్ర వైద్య చర్చల ప్రాముఖ్యతను వివరిస్తూ, పెరుగుతున్న సూపర్-స్పెషలైజేషన్ కారణంగా వివిధ విభాగాల మధ్య పరస్పర సంప్రదింపులకు అవకాశాలు తగ్గిపోతున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. రోగనిర్ధారణ సంస్థలు ఇటువంటి మల్టీ-స్పెషాలిటీ విద్యా వేదికలను ఏర్పాటు చేయడం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉందని ఆయన అన్నారు. వైద్య రంగం ప్రస్తుతం మెడ్‌టెక్, ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ డేటా సైన్సెస్ వంటి అనేక విభాగాలతో అనుసంధానమై విస్తరిస్తున్న తరుణంలో ఈ తరహా సమగ్ర దృక్పథం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

గత కొన్ని దశాబ్దాలుగా వైద్య శాస్త్రంలో వచ్చిన మార్పులను వివరిస్తూ, సాంప్రదాయ క్లినికల్ అభ్యాస దశ నుంచి ఇమేజింగ్, మాలిక్యులర్ టూల్స్, అల్ట్రాసౌండ్, సిటి స్కాన్, ఎంఆర్ఐ, ప్రస్తుతం జెనోమిక్స్ ఆధారిత యుగం వరకు సాగిన పరిణామ క్రమాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. గతంలో వైద్య నైపుణ్యం అనేది కేవలం విస్తృతమైన చదువుపైనే ఆధారపడి ఉండేదని, కానీ నేడు ఆ పరిస్థితి మారిందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఏఐ ఆధారిత వ్యవస్థలు వైద్యుల క్లినికల్ నిర్ణయాలకు తోడ్పడుతూ వాటిని మరింత మెరుగుపరుస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే, ఆరోగ్య సేవల్లో కమ్యూనికేషన్ అడ్డంకులను ఏఐ భాషా పరికరాలు తొలగిస్తున్నాయని, దీనివల్ల మొబైల్ క్లినిక్‌లు, డిజిటల్ వేదికల ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా వైద్య సేవలు మరింత విస్తృతంగా ప్రజలకు చేరువవుతున్నాయని ఆయన వెల్లడించారు.

భారతదేశంలో మారుతున్న వ్యాధుల స్థితిగతుల గురించి మంత్రి వివరంగా మాట్లాడుతూ, ఒకప్పుడు కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితమైన వ్యాధులు - ఉదాహరణకు దక్షిణ భారతదేశంలో మధుమేహం (డయాబెటిస్) లేదా హిమాలయ ప్రాంతాల్లో థైరాయిడ్ రుగ్మతలు నేడు దేశవ్యాప్తంగా కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. జీవనశైలిలో వచ్చిన మార్పులు, గ్రామీణ, పట్టణ వ్యత్యాసాలు తగ్గిపోవడం వంటి కారణాలే దీనికి కారణమని ఆయన వివరించారు. పెరుగుతున్న నగటు ఆయుర్దాయం కారణంగా వయోసంబంధిత వ్యాధులు ముందంజలోకి వచ్చాయి, అదే సమయంలో జీవనశైలి వ్యాధులు చిన్న వయసులోనే కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఒకదానితో ఒకటి కలిసిపోయే లక్షణాలున్న వ్యాధులను గుర్తించడానికి, తప్పుడు చికిత్సా పద్ధతులను నివారించడానికి ముందస్తు, కచ్చితమైన రోగనిర్ధారణ పరీక్షలు అనివార్యమయ్యాయి.

భారత్ జెనోమిక్స్, జీన్ థెరపీలో సరికొత్త యుగంలోకి అడుగుపెడుతోందని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో జీనోమ్ సీక్వెన్సింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రాథమికంగా పది లక్షల మంది వ్యక్తుల జీనోమ్ సీక్వెన్సింగ్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన వెల్లడించారు. హిమోఫీలియా వ్యాధికి సంబంధించి ప్రముఖ వైద్య సంస్థల భాగస్వామ్యంతో జరిగిన జీన్ థెరపీ క్లినికల్ పరిశోధనలు విజయవంతం కావడం ఒక గొప్ప శాస్త్రీయ విజయమని ఆయన పేర్కొన్నారు. అలాగే, భారత మొట్టమొదటి స్వదేశీ యాంటీబయోటిక్ 'నాఫిత్రోమైసిన్' తయారీ దేశంలో పెరుగుతున్న లైఫ్ సైన్సెస్ సామర్థ్యాలకు నిదర్శనమని ఆయన వెల్లడించారు.

రాబోయే దశాబ్దాల్లో జన్యుపరమైన ప్రొఫైలింగ్, పర్యావరణ అంశాలు, జీవనశైలి ఆధారంగా అందించే వ్యక్తిగతీకరించిన చికిత్సలు సర్వసాధారణం అవుతాయని మంత్రి పేర్కొన్నారు. ఏఐ ఆధారిత రోగనిర్ధారణ విశ్లేషణలు, జెనోమిక్ ఆలోచనలతో కలిసి వైద్యులు అందరికీ ఒకే రకమైన చికిత్స కాకుండా, ప్రతి రోగికి అవసరమైన ప్రత్యేక చికిత్సా విధానాలను రూపొందించేందుకు వీలు కల్పిస్తాయని ఆయన వివరించారు.

భారతదేశ పరిశోధనా రంగాన్ని విస్తరించడం కోసం చేపట్టిన విధానపరమైన సంస్కరణల గురించి కూడా డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడారు. అంతరిక్షం, న్యూక్లియర్ మెడిసిన్,అత్యాధునిక ఆరోగ్య పరిశోధన వంటి రంగాలలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం తలుపులు తెరిచిందని, ఇది ఆవిష్కరణలకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పరిశోధనలతో కలిసి పనిచేయాలని ప్రముఖ రోగనిర్ధారణ సంస్థలను ఆయన ఆహ్వానించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల బలాన్ని ఏకం చేయడం ద్వారా న్యూక్లియర్ మెడిసిన్ థెరపీ, అడ్వాన్స్‌డ్ ఆంకాలజీ (క్యాన్సర్) చికిత్స వంటి రంగాలలో విప్లవాత్మక మార్పులను వేగవంతం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్య రంగాన్ని విస్తృత జాతీయ దృక్పథంతో అనుసంధానిస్తూ, భారత జనాభాలో 70 శాతానికి పైగా 40 ఏళ్లలోపు వారే ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. దేశ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం, యువ శక్తిని సద్వినియోగం చేసుకోవడం వికసిత్ భారత్ నిర్మాణంలో అత్యంత కీలకమని ఆయన అన్నారు. ఏఐ, జెనోమిక్స్ , విశ్వసనీయమైన నాణ్యతా ప్రమాణాలతో కూడిన బలమైన రోగనిర్ధారణ వ్యవస్థ నివారణ, కచ్చితత్వంతో కూడిన వైద్యం అందరికీ అందుబాటులోకి రావడంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు.

# వరంగల్ పాలిటెక్నిక్ ప్లాటినం జూబ్లీ వేడుకలకు గ్రాండ్ ప్లాన్




హన్మకొండ, ఫిబ్రవరి 22: మార్చి 29న (ఆదివారం) వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈవీ శ్రీనివాస్ రావు తెలిపారు.

ఆదివారం కాలేజీలో జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశంలో ఈవీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. 70 ఏళ్ల పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రతి పూర్వ విద్యార్థి తప్పనిసరిగా పాల్గొని, కాలేజీలో చదివిన రోజులు, మధురస్మృతులను స్మరించుకునే ఈ అరుదైన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనే పూర్వవిద్యార్థులు వెంటనే రూ.1,000 నమోదు రుసుం జమచేసి తమ పూర్తి వివరాలను తెలియజేయాలని కోరారు. (బ్యాంకు వివరాలు: ఖాతా నెంబర్: 62052476227, ఖాతా పేరు: పూర్వ విద్యార్థుల సంఘం, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్, బ్యాంకు పేరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శాఖ: ఎంజీఎం వరంగల్). ఈ సందర్భంగా కాలేజీ అభివృద్ధి కోసం రూ.10 వేలు విరాళం అందించిన 1965 బ్యాచ్ పూర్వవిద్యార్థి ఎం.మల్లారెడ్డిని సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం పెద్దలు టీఎన్ స్వామి, ప్రకాష్, ఉదయ భాస్కర్, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్‌కుమార్‌తో పాటు సీనియర్ నాయకులు బొద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్రావు, శ్యామ్, ఉమేందర్, వసంత్‌కుమార్, శశి, కుమార్, ఉషాకిరణ్, కార్తీక్, కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# చండూరు పట్టణంలో ఘనంగా మార్కండేయ స్వామి వారి జాతర




నల్గొండ, ఫిబ్రవరి 22: నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు పట్టణ కేంద్రంలోని శ్రీ మార్కండేశ్వర స్వామి జాతర ను ఘనంగా నిర్వహించారు. ఆదివారం విఘ్నేశ్వర పూజ, స్వస్తివాచనము, అంకురార్పణ, మంటపారాధన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణ నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కళ్యాణ మహోత్సవమునకు పచ్చటి తోరణం, వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన నంది శకటము (ఎడ్ల బండి)పై మగ్గమును ఏర్పాటుచేసి, పట్టు వస్త్రాలను తయారుచేసి ఆనవాయితీని చండూరు చేనేత కళాకారులు కొనసాగించారు. ఈ సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం హోమము, బలిహరణ, భేరి పూజలు చేపట్టారు. ఆది వారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం, ఈనెల 25న విమాన రథోత్సవం, 26 న అగ్ని గుండాలు, 28న శ్రీ భూ,నీలాసమేత వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణము జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు .

# "సుపరిపాలనకు అడ్మినిస్ట్రేటివ్ డేటా వినియోగం: రాష్ట్ర స్థాయిలో శాఖాపరమైన డేటా సమన్వయం" అనే అంశంపై విజ్ఞాన భవన్‌లో జాతీయ స్థాయి కార్యశాలను నిర్వహించనున్న ఎంఏఎస్‌పీఐ

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 22: "సుపరిపాలనకు అడ్మినిస్ట్రేటివ్ డేటా వినియోగం: రాష్ట్ర స్థాయిలో శాఖాపరమైన డేటా సమన్వయం" అనే అంశంపై 24 ఫిబ్రవరి 2026న విజ్ఞాన భవన్‌లో ఎంఏఎస్‌పీఐ నిర్వహించనున్న జాతీయ స్థాయి కార్యశాలలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, వివిధ ప్రభుత్వ విభాగాలు, ఇతర భాగస్వాములు పాల్గొంటారు.

డిసెంబర్ 2025లో జరిగిన రాష్ట్రాలు, యుటీల ప్రధాన కార్యదర్శుల 5వ జాతీయ సదస్సుకు కొనసాగింపుగా.. "సుపరిపాలనకు అడ్మినిస్ట్రేటివ్ డేటా వినియోగం: రాష్ట్ర స్థాయిలో శాఖాపరమైన డేటా సమన్వయం" అంశంపై ఏప్రిల్ 2026లో ఎంఎస్‌పీఐ నిర్వహించనున్న ఒక జాతీయ స్థాయి సమావేశం "డేటా ఫర్ డెవలప్‌మెంట్" కోసం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఇతర భాగస్వాములతో జరుగుతున్న సన్నాహక ప్రక్రియలో భాగంగా ఈ కార్యశాలను నిర్వహిస్తున్నారు.

అడ్మినిస్ట్రేటివ్ డేటా వ్యవస్థలను బలోపేతం చేయటానికి, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత స్థాయిలో వివిధ శాఖల మధ్య డేటా సమన్వయాన్ని పెంపొందించటానికి నిర్మాణాత్మక జాతీయ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లటమే ఈ సదస్సు లక్ష్యం.

రాష్ట్ర స్థాయి అంతర్గత కార్యశాల లక్ష్యాలు, పరిధి, చర్చించాల్సిన ప్రధానాంశాల గురించి రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు అవగాహన కల్పించటమే ఈ కార్యశాల ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వం, అంతర్జాతీయ సంస్థలు, పరిశ్రమలు, వ్యూహారచనా సంస్థలు, విద్యా రంగాలకు చెందిన నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొని, అడ్మినిస్ట్రేటివ్ డేటా సమన్వయంలోని అంశాలపై చర్చిస్తారు. ఇప్పటికే విజయవంతమైన సందర్భాలను ప్రదర్శిస్తారు. రాష్ట్ర స్థాయి కార్యశాలల ద్వారా సేకరించిన అభిప్రాయాలను, సూచనలను ఏప్రిల్ 2026లో జరిగే జాతీయ స్థాయి సదస్సులో చర్చించి, ప్రాధాన్యత ఇవ్వాల్సిన సంస్కరణలను గుర్తిస్తారు.

ఈ కార్యశాలకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రణాళిక, ఐటీ విభాగాల అధికారులు, కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాల అధికారులు, ఇతర భాగస్వాములు హాజరవుతారు.

# పారిశుద్ధ్య నివారణకే తొలి ప్రాధాన్యత : మున్సిపల్ చైర్ పర్సన్



నల్గొండ, ఫిబ్రవరి 22: పట్టణంలో పారిశుద్ధ్య నివారణకే తొలి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు పేర్కొన్నారు ఆదివారం కోదాడ పట్టణంలోని పాత మున్సిపాలిటీ నుంచి దోమల మందు పిచికారి కార్యక్రమాన్ని ప్రారంభించారు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకు పారిశుద్ధ్య నివారణతో పాటు దోమలు బెడదను నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రజల సహకరించాలని ఇళ్లలోని చెత్తను వీధుల్లో వేయకుండా చెత్త బండిలోనే వేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గుండపనేని పద్మావతి , కందుల కోటేశ్వరరావు, తోట జ్యోతి, కట్టబోయిన జ్యోతి, పలువురు కౌన్సిలర్లు ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**

RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com